క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కర్నూలు(అర్బన్): మహిళలు కష్టపడే తత్వాన్ని అలవరచుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆయేషా ఖాతూన్ సూచించారు. మహిళల ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తే కుటుంబాలు బాగుపడతాయన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన మహిళలు విద్య, చేతి వృత్తులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం ఆమె సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టైలరింగ్‌లో నైపుణ్యం సాధించడం ద్వారా సూక్ష్మ పరిశ్రమలు స్థాపించుకునేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ట్రైనింగ్ సెంటర్ కో–ఆర్డినేటర్ సయ్యద్ ఖుద్రతుల్లా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

కర్నూలు (టౌన్): రాజమండ్రిలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, సీనియర్ ఉషూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు బుధవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, సీతఊట రమణ, ఉషూ సంఘం అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అంతర్ పాఠశాలల తైక్వాండో పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసరి సుధీర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులు తరచూ పోటీల్లో పాల్గొనడం ద్వారా ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు సదరం సర్టిఫికెట్లు

కర్నూలు(హాస్పిటల్): ట్రాన్స్‌జెండర్లు (లింగ మార్పిడి చేయించుకున్న) వారికి బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సదరం సర్టిఫికెట్లను మంజూరు చేశారు. వీరిని యురాలజీ, ఎండోక్రైనాలజీ, సైకియాట్రిక్ విభాగాలకు చెందిన వైద్యులు పరిశీలించి అర్హులైన ఐదుగురు ట్రాన్స్‌జెండర్లకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, సదరం క్యాంపు ఇన్‌చార్జ్ షహనాజ్ బేగం, అనిల్‌కుమార్, ట్రాన్స్‌జెండర్స్ కో–ఆర్డినేటర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కల్లూరు: రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు సుధాకరప్ప, నరసింహులు కోరారు. ఈ మేరకు బుధవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని ఆమె కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు, సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ఏసు కలసి వినతి పత్రమిచ్చారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేస్తానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక హామీ ఎక్కడా అమలుకావడం లేదన్నారు. జిల్లా కేంద్రానికి దూరంగా గుడికంబాలిలో ఇసుక రీచ్ ఉండడం వల్ల అక్కడి నుంచి నగరానికి ఇసుక రావాలంటే రవాణా చార్జీలతో కలిపి ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. కర్నూలుకు దగ్గరలో ఉన్న ఇసుక రీచ్‌లను ప్రారంభించాలన్నారు. జీఓ 17ను రద్దు చేసి కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అబ్దుల్ రహిమాన్, శ్రీనివాసులు, అజిముద్దీన్, శ్రీనివాసులు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

రేపు మిలిటరీ సర్వీస్ పెన్షనర్లకు అవగాహన

కర్నూలు(అర్బన్): బీ క్యాంప్‌లోని టీజీ వెంకటేష్ కళ్యాణ మండపంలో ఈ నెల 30వ తేదీన కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో స్పర్ష్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ ఆర్ రత్నరూత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డిఫెన్స్ అకౌంట్స్ డిపార్టుమెంట్ అధికారులు, సిబ్బంది హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిలిటరీ సర్వీస్ పెన్షనర్లు, డిఫెన్స్ సివిలీయన్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు సంబంధించిన ఫిర్యాదులు, సేవలు అందిస్తారని తెలిపారు. పెన్షనర్లు మాన్యువల్, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు కూడా సమర్పించవచ్చన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన మిలిటరీ సర్వీస్ పెన్షనర్లు విన్నవించుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 08518–229445, సెల్: 8688817886 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తహసీల్దార్, ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): తప్పుడు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసిన కౌతాళం తహసీల్దార్, ఆర్‌ఐలపై చర్యలు తీసుకోవాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టీఎస్‌ఎఫ్ నాయకులు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యను కలిసి వినతిపత్రాన్ని అందించారు. నాయకులు వెంకటేష్, రాజీవ్, మధుకృష్ణ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అపరిచితులను నియంత్రించాలి



ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు, సౌకర్యాలు బాగున్నాయి. అవసరమనుకున్న చోట్ల మరిన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తూనే ఉన్నాయి. పోలీసులను క్యాజువాలిటీ వరకు మాత్రమే పరిమితం చేయాలి. వార్డుల్లోకి అనుమతించడం సరికాదు. ఆసుపత్రి సెక్యూరిటీని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. పీజీ వైద్య విద్యార్థులపై పనిభారం ఎక్కువగా ఉన్న మాట వాస్తవమే. మేము చదివే రోజుల్లో నిరంతరంగా 72 గంటలు పనిచేసేవాళ్లం. ఇప్పుడు కాస్త మేలు. 12 గంటల కంటే ఎక్కువ పని చెప్పకుండా ఆ తర్వాత వారిని చదువుకునేందుకు అవకాశం ఇస్తే బాగుంటుంది. ప్రస్తుతం పీజీల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ మేరకు పని విభజన చేసుకుని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చు. ఆసుపత్రిలోని వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బందికి ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు, యాప్రాన్ (యూనిఫాం) తప్పనిసరి చేయాలి. రోగుల సహాయకులకు విజిటింగ్ పాసులివ్వాలి. అప్పుడు ఆసుపత్రిలో అపరిచితులు ఎవరు వస్తున్నారో సులభంగా తెలిసిపోతుంది.

– డాక్టర్ జీఎస్.రామప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, కేఎంసీ, కర్నూలు



వైద్య విద్యార్థుల తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు



తమ పిల్లలు గొప్ప వైద్యులు కావాలని చిన్నతనం నుంచి తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించి ఉంటారు. అలాంటి వారిని ఎక్కడో దూరంగా, తెలియని ప్రాంతంలో ఉంచి చదివించాలంటే ఆందోళనగా ఉంటుంది. కోల్‌కతా లాంటి సంఘటనలు జరిగిన ప్రతిసారీ వారి గుండెలు తల్లడిల్లుతుంటాయి. తమ పిల్లలకు ఏమవుతుందోనన్న భయం ప్రతి క్షణం వారిని వెంటాడుతుంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో మాదిరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సహాయకులను నియంత్రించడం కుదరదు. ప్రతి ఒక్కరూ తోసుకుని, దౌర్జన్యంగా, ఇది మా హక్కు అని వస్తుంటారు. ఎక్కువ మంది వస్తే రోగికి ఇన్‌ఫెక్షన్ అవుతుందని చెప్పినా వారు వినే పరిస్థితి ఉండదు. ఎక్కువ మంది రోగి బంధువులు ఉన్నప్పుడు వైద్యం చేయాలంటే ఏ డాక్టర్‌కైనా కష్టంగా ఉంటుంది. కాబట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సహాయకులను నియంత్రించాలి. పీజీలకు వర్కింగ్ అవర్స్ ఎక్కువగా ఉంటున్నాయి. మేము చదివిన కాలం నుంచి ఇప్పటివరకు అదే పరిస్థితి ఉంది. కనీసం రోజుకు ఆరు గంటలు నిద్రపోవడానికి కూడా సమయం ఉండదు. వారికి పని గంటలు తగ్గించి చదువుకునే అవకాశం, విశ్రాంతి తీసుకునే సమయం ఇవ్వాలి.

– డాక్టర్ విజయకృష్ణారెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్, కర్నూలు

తెలుగు సాహితీ కృషీవలురు

- చిన్నారులను రచయితలుగా మలచడంలో ఒకరు దిట్ట
- సాహిత్యానికి కృషి చేస్తున్న ఘనాపాటి మరొకరు
- నేడు తెలుగు భాషా దినోత్సవం





పుల్లా రామాంజనేయులు, విద్యార్థులు రచించిన పుస్తకాలు, చిప్పగిరి కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యంలో విశేష ప్రతిభ కనబరచడం.. సాహితీ సేవ చేయడం.. మాతృభాషను బోధించడం.. విద్యార్థులచే సాహిత్య రచన చేయించడంలో ఒకరు సిద్ధహస్తులు. మరొకరు సాహిత్య రచనలు చేయడం.. మాతృభాషను బోధించడం.. తెలుగు భాషా వికాసానికి కృషి చేయడంలో దిట్ట. ఈనెల 29వ తేదీ గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని సాహితీ సేవ చేస్తున్న ఇరువురు కృషీవలుర గురించి తెలుసుకుందాం.

విద్యార్థులచే సాహిత్య రచన

తుగ్గలి మండలం ఉప్పరపల్లె గ్రామంలో కేశమ్మ, గోవిందులు దంపతులకు 1974 జూన్ 7న జన్మించారు పుల్లా రామాంజనేయులు. పత్తికొండలో 6 నుంచి 12వ తరగతి వరకు కర్నూలు ఎస్టీబీసీ డిగ్రీ కళాశాల, కర్నూలు పీజీ సెంటర్‌లో ఎంఏ తెలుగు, కర్నూలు ఐఏఎస్ఈలో తెలుగు పండిత శిక్షణ పొందారు. 2000లో తెలుగు ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరారు. మద్దికెర, పెరవలి, చిప్పగిరిలో పాఠశాలల్లో పనిచేశారు. ప్రస్తుతం పోలకల్ జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

సామాజిక, సాహిత్య సేవా కార్యక్రమాలు

మద్దికెర, పెరవలి, చిప్పగిరి పాఠశాలల్లో మొక్కల పెంపకం, బడి బ్యాంక్, పాఠశాల రికార్డ్, రోజుకొక పద్యం, భావం, మట్టివినాయక విగ్రహాల తయారీ, నైతిక విలువలు, 32 మంది కవులపై సెమినార్ల నిర్వహణ, గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు నెమిళ వేంకటేశ శతకంపై 7వ తరగతి విద్యార్థి పుల్లా మురళి ఆకాశ్ అవధానం, వేమన శతకంపై కీర్తి, తేజస్విని, పూజిత, రాజేశ్వరి, రజని, చంద్రకళ ఆరుగురు విద్యార్థినుల అవధానం, బడి పిల్లల టాలెంట్ యూట్యూబ్ చానల్ నిర్వహణ, మాతృభాషా దినోత్సవ సందర్భంగా 110 మంది విద్యార్థులచే 110 మంది కవులపై పరిచయ కార్యక్రమం.

విద్యార్థుల సంకలనాలు.. పుస్తకాలు

సృజన, జాగృతి, ప్రేరణ (పుల్లా మురళి ఆకాశ్), నమితాపదాలు (నమిత), ఇమాం సాహెబ్ కథలు, దేశమంటే (పెరవలి పిల్లల దేశభక్తి గేయాలు), ముగింపు లేని కథ (పుల్లా మురళి ఆకాశ్), దాచిన ఉత్తరం కథలు, చిగురించిన శిల్ప గిరి కథలు, ఒక చిత్ర అనేక కథలు, ఎగిరే మనిషి (పుల్లా మురళి ఆకాశ్ తెలుగు, ఆంగ్లం కథలు), ఏటిగడ్డ కథలు, చిప్పగిరి కథలు.

విద్యార్థులకు వరించిన పురస్కారాలు

బాల ప్రతిభా అవార్డులు, చింతోజీ బ్రహ్మయ్య బాలమణి చైతన్య పురస్కారాలు, పెండోటి బాల పురస్కారం, నారం శెట్టి బాల ప్రతిభా పురస్కారం, బాలమణి సంస్థచే నెహ్రూ జాతీయ పురస్కారం వరించాయి.



ఉగాది నవలల పోటీల్లో తనికెళ్ల భరణి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న రామాంజనేయులు

పుల్లా రామాంజనేయులు రచనలు – వరించిన పురస్కారాలు

- జీవన చిత్రాలు, కవితా స్పందన, స్వర్ణగిరి కథలు, మాతా నీవులేని జీవితం (ఒత్తులు లేని తొలి తెలుగు బాలల ఫాంటసీ నవల), తోకలేని పిట్ట
- విజయనామ ఉగాది పురస్కారం, గురజాడ జాతీయ పురస్కారం, హీరాలాల్ స్మారక పురస్కారం, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, బాలబంధు పురస్కారం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రత్న జాతీయ పురస్కారం, సహస్ర కవిరత్న, తోకలేని పిట్టకు చదువు
- అన్వీక్షి ఉపాధి నవలలు పోటీలో ప్రోత్సాహక బహుతి అందుకున్నారు.



చిన్నావుల వెంకట రాజారెడ్డి దంపతులను సన్మానిస్తున్న సాహితీ వేత్తలు, కళాకారులు

తెలుగు కల్లం సాహితీ సమితి వికాసం

వైఎస్సార్ జిల్లా కొమరోలు మండలం, మాధవపల్లె గ్రామంలో చిన్నావుల పోలమ్మ, చిన్నావుల పుల్లారెడ్డి దంపతులకు 1976 మే 1న డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి జన్మించారు. ఈయన పుట్టుకతో అంధుడు. వైఎస్సార్ జిల్లా అంధుల పాఠశాలలో 10వ తరగతి వరకు బ్రెయిలీ లిపిలో చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీ, ఎంఏ తెలుగు, పీహెచ్‌డీ, బీఈడీ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో చదివారు. 2002లో అరికెర ఎంపీయూపీ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరారు. కోడుమూరు బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం దిన్నెదేవరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

సాహిత్య వ్యాప్తికి కృషి

తెలుగు కల్లం సాహితీ సమితి ఏర్పాటు చేసి సాహిత్య వికాసం, తెలుగు భాషా వికాసానికి కృషి చేస్తున్నారు. డాక్టర్ జక్కంపూడి మునిరత్నం వచన కవితానుశీలన అనే అంశంపై సిద్ధాంత వ్యాస గ్రంథం సమర్పించి పీహెచ్‌డీ పొందారు.

- తెలుగు ధీర శతకం (తొలి పద్య రచన), వేంకటాచార్యుని మాట – వెలుగు బాట, భావతరంగిణి
- వ్యాస సంపుటి, శతక సూక్తి మాలిక, వినుము శ్రీకాంతు నామాట – సౌందర్య దృక్పథం, వెన్నముద్దలు, బాలల కథాలహరి, వెలుగు దారాలు, గుండెపూసిన అక్షరాలు ఈయన సాహిత్య రచనలు.
- తెలుగు కల్లం సాహితీ సంస్థ ద్వారా 21 కవి సమ్మేళనాలు నిర్వహించారు. ప్రముఖ తెలుగు కవులు, రచయితల జయంతి, వర్ధంతి, మాతృభాషా దినోత్సవం లాంటి వాటిపై సాహితీ సభలు, సమావేశాల నిర్వహణ. ఆకాశవాణి రేడియో ద్వారా సూక్తి సుధ, సూక్తి రత్నావళి, తెలుగు పద్య పఠనం, స్వీయ కవితలు, శీర్షికలతో తెలుగు సాహిత్య ప్రసంగాలు చేశారు. తిరుపతి ఎస్వీయూ, అనంతపురం ఎస్కేయూ, కర్నూలు ఆర్‌యూ, వైఎస్సార్ కడప వైవీయూలో నిర్వహించిన అంతర్జాతీయ, జాతీయ సెమినార్లలో పాల్గొని 39 పరిశోధన పత్రాలు సమర్పించారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు కోరారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్‌ను బుధవారం కలిసి విన్నవించారు. జిల్లాలోని నర్సులు, పారామెడికల్, నాల్గవ తరగతి ఉద్యోగులు దీర్ఘకాలంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని సత్వరమే పరిష్కరించాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎ.మాధవరాజు, జిల్లా కార్యదర్శి బంగారి, ఉపాధ్యక్షులు శాంతిలత, సుబ్బయ్య, జాయింట్ సెక్రటరీ జయకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ రాముడు, సెక్రటరీ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

నిరసనకారుల ప్రాణాలు బలిగొన్న దుర్మార్గుడు చంద్రబాబు

కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి ఏపీలో 2000 సంవత్సరంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని పోరాటం చేస్తున్న నిరసనకారులపై చంద్రబాబునాయుడు పాశవికంగా కాల్పులు జరిపించి ముగ్గురి ప్రాణాలను బలిగొన్న దుర్మార్గుడని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వాముల చిత్రపటాలకు బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ బ్యాంకు సంస్కరణలు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా అప్పటి ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడితే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండి అణచి వేశారన్నారు. ముగ్గురి ప్రాణాలను తీసుకోవడమే గాక అనేక మందిని గాయపాలు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. నాయకులు రామాంజనేయులు, రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఖాతాదారులకు మరింత సౌలభ్యంగా ఉండాలనే లక్ష్యంతో గూడూరు మండలంలోని పెంచికలపాడు బ్రాంచిని నూతన భవనంలోకి మార్పు చేసినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జోన్ డీజీఎం ఎంవీఎస్ సుధాకర్ తెలిపారు. బుధవారం పెంచికలపాడు బ్రాంచ్ నూతన భవనాన్ని విశ్వభారతి మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ చైర్మన్ కాంతారెడ్డి, కర్నూలు డీఎస్పీ జే.బాబు ప్రసాద్, బ్యాంక్ ఆఫ్ బరోడా తిరుపతి రీజినల్ హెడ్ పి.అమరనాథరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే బ్యాంక్ ఆఫ్ బరోడా రెండవ అతి పెద్ద బ్యాంక్‌గా సేవలందిస్తోందని చెప్పారు. పెంచికలపాడు శాఖ ద్వారా 20 గ్రామాలకు చెందిన రైతులు, అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నట్లు వివరించారు. దాదాపు 60 వేల మంది ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. స్థానిక బ్రాంచ్ మేనేజర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పెంచికలపాడు బీఓబీ శాఖ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డీజీఎం

నాణ్యమైన వైద్యసేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో చికిత్సకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆస్పత్రి ధన్వంతరి హాలులో నర్సింగ్ సిబ్బందికి ఇన్‌ఫెక్షన్ నియంత్రణ, నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌ఫెక్షన్ అయిన రోగులకు ఏ విధంగా సేవలందించాలి, ఎలా నియంత్రించాలనే దానిపై వైద్యులచే శిక్షణ ఇప్పించారు. మైక్రోబయాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్లు విజయలక్ష్మి, సుధీర్, దమామ్ శ్రీనివాసులు, బి.వెంకటేశ్వరరావు, శివబాల నాగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి 25 ఫ్యాన్ల విరాళం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు స్థానిక మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల ట్రస్ట్, హైదరాబాద్ వారు 25 క్రాంప్టన్ హైస్పీడ్ 1200 ఎంఎం ఫ్యాన్‌లను విరాళంగా అందించారు. ఎస్‌ఆర్‌ఐ, కేఎంసీ 1962 బ్యాచ్ గ్రాడ్యుయేట్ డాక్టర్ విశ్వనాథరెడ్డి వీటిని పంపించారు. వీటిని రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ, కేఎంసీ గ్రాడ్యుయేట్ సభ్యులు డాక్టర్ కె.శివశంకర్‌రెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి బుధవారం అందజేశారు. కోవెలకుంట్ల వాసి అయిన డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి ప్రస్తుతం అమెరికాలోని చికాగోలో పనిచేసి కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. ఆయన పంపిన ఫ్యాన్లను ఆసుపత్రి పీడియాట్రిక్ వార్డులలో కామన్ వెయిటింగ్ హాలులో రోగులకు విశ్రాంతి సమయంలో దోమల బెడద లేకుండా ఉపయోగించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. త్వరలో మరో 100 ఫ్యాన్లు విరాళంగా అందనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన కర్నూలు మెడికల్ కాలేజి గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ సెక్రటరీ డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ శివశంకర్‌రెడ్డిలకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



పెద్దాసుపత్రి కోసం సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి ఫ్యాన్లను విరాళంగా అందిస్తున్న డాక్టర్ కె.శివశంకర్‌రెడ్డి

బంగారు గొలుసు చోరీ

కర్నూలు: కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో బ్యాంకు ఉద్యోగి బ్యాగులో బంగారు గొలుసు మాయమైంది. దేవనకొండ మండలం నల్లచెలిమల గ్రామానికి చెందిన నాగరాజు ప్రకాశం జిల్లా దోర్నాల ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తున్నారు. ఈయన కుటుంబ సభ్యులతో కలిసి సెలవులకు స్వగ్రామం నల్లచెలిమలకు వచ్చి తిరిగి దోర్నాలకు వెళ్లేందుకు బుధవారం కర్నూలు బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగులో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును తస్కరించారు. కొద్ది సేపు తర్వాత గుర్తించిన నాగరాజు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కర్నూలు కొత్తబస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో జోరుగా పేకాట సాగుతున్నట్లు సమాచారం అందడంతో నాల్గవ పట్టణ పోలీసులు దాడులు నిర్వహించి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కర్నూలు నగరంతో పాటు గోనెగండ్లకు చెందిన ఇద్దరు ఉన్నట్లు సమాచారం.

మురుగు కాల్వలో పైపులైన్ వద్దు

కర్నూలు (టౌన్): మురుగు కాల్వకు ఆనుకొని నిర్మిస్తున్న పైపులైన్‌ను తొలగించాలని రుక్మిణీనగర్ వాసులు హుస్సేన్‌సాబ్, లోక్‌నాథ్ రెడ్డి విన్నవించారు. ఈ మేరకు బుధవారం స్థానిక నగరపాలకలోని మేనేజర్ చిన్నరాముడును కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మురుగు కాల్వ వైపు కాకుండా రహదారి పక్కన పైప్‌పైల్ ఏర్పాటు చేయాలని, అలాగే దెబ్బతిన్న పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. సమస్యను ఇంజినీరింగ్ విభాగం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మేనేజర్ హామీ ఇచ్చారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం

కర్నూలు కల్చరల్: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం నగర అధ్యక్షురాలు బి.రాణి లీలావతి తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘం, కళాశాల తెలుగు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్లస్టర్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య డీవీవీ సాయిగోపాల్, రిజిస్ట్రార్ ఆచార్య వెంకటేశ్వర్లు, అరసం గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.హరికిషన్ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ బాల సాహితీవేత్త పుల్లా రామాంజనేయులు, రచయిత్రి లక్ష్మీ కందిమల్లకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

పతకాలతో తిరిగి రండి

కర్నూలు (టౌన్): అనకాపల్లిలో ఈ నెల 30, 31 తేదీలు, వచ్చే నెల 1వ తేదీన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారులు పతకాలతో తిరిగి రావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని వెయిట్ లిఫ్టింగ్ హాలులో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేతు శివరాం గౌడ్, సాయి బాలాజీ ఆఫ్టికల్స్ అధినేత ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో వెయిట్ లిఫ్టర్లకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్షావలి (పాపా) కార్యదర్శి నాగరాజు, శిక్షకుడు యూసుఫ్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

కర్నూలు (టౌన్): పతకాలు సాధించే దిశగా క్రీడాకారులను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని చెస్, క్యారమ్స్, వెయిట్ లిఫ్టింగ్, యోగా, హై జంప్ క్రీడాంశాలను ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణితో కలిసి జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. క్రీడల నిర్వహణ, వసతులకు సంబంధించి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావును అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించే పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు.

నేడు ర్యాలీ

జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు నగరంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం నుంచి ర్యాలీ చేపట్టి ఎస్టీబీసీ కళాశాల సర్కిల్ మీదుగా తిరిగి ఔట్‌డోర్ స్టేడియంకు చేరుకుంటుందని వివరించారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.



యోగా పోటీలను పరిశీలిస్తున్న జేసీ బి.నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి

సచివాలయాల ఉద్యోగులకు నేడు కౌన్సెలింగ్

- పెన్షన్ల పంపిణీ తరువాతే రిలీవ్
- బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు (టౌన్): కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు సంబంధించి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. నగరంలోని 136 సచివాలయాల్లో ఉన్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం రాత్రి ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టినా, ఉద్యోగులను మాత్రం సెప్టెంబర్ నెల పెన్షన్ల ప్రక్రియ పూర్తి చేసిన తరువాతే రిలీవ్ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల సంచాలకులు శివప్రసాద్ సర్క్యులర్ జారీ చేశారు.

తొలిరోజు 3,312 టన్నుల ఇసుక సరఫరా

- సెప్టెంబర్ 11 నుంచి ఆన్‌లైన్ బుకింగ్

కర్నూలు (టౌన్): జిల్లాలో ఇసుక బుకింగ్స్‌కు మొదటి రోజు బుధవారం మంచి స్పందన వచ్చినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు. కర్నూలులో 115 బుకింగ్స్‌తో పాటు సి.బెళగల్‌లో 80 చొప్పున మొత్తం 195 బుకింగ్స్ నమోదు చేసినట్లు చెప్పారు. వ్యక్తిగతంగా కౌంటర్ల వద్దకు వచ్చిన ఇసుక వినియోగదారులు బుకింగ్ చేశారన్నారు. మొత్తం 3,312 టన్నుల ఇసుకను సరఫరా చేసినట్లు చెప్పారు. 150 టిప్పర్లు, 45 ట్రాక్టర్లలో వినియోగదారులు ఇసుకను తరలించామన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక సరఫరా ఉంటుందని చెప్పారు. వచ్చే నెల 11వ తేదీ నుంచి ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల కబడ్డీ పోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. పోటీల్లో బాలికల విభాగంలో డోన్ నారాయణ స్కూల్, టంగుటూరు ప్రకాశం పంతులు మున్సిపల్ హైస్కూల్ జట్లు (కర్నూలు), బాలుర విభాగంలో ఇండస్, కేశవరెడ్డి స్కూల్ (కృష్ణానగర్) నారాయణ జట్లు విజేతలుగా నిలిచాయి. అతిథిగా న్యాయవాది శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడం మంచి పరిణామమన్నారు. విజేతలకు గురువారం జరిగే జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేస్తారని చెప్పారు.

మహిళా సంఘాల నిరసన

కర్నూలు(సెంట్రల్): ప్రేమ, పెళ్లిళ్ల పేరుతో యువతులను మోసం చేస్తున్న సీహెచ్ విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ మహిళా సమాఖ్య, ఎస్‌ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, బీసన్న, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహనతో ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): హెచ్‌ఐవీ/ఎయిడ్స్ పట్ల యువత అవగాహనతో ఉండాలని ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సమీవుద్దీన్ ముజమ్మిల్ సూచించారు. సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఇకో డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉస్మానియా కళాశాలలో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్, సుఖవ్యాధులు ఎలా వస్తాయో వివరించారు. ఈ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పారు. టోల్‌ఫ్రీ నంబర్ 1097 గురించి వివరించారు. కార్యక్రమంలో ఎ.అబిద్ అలీ, ఒబెదుల్లా షరీఫ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.